ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో సందర్శన

ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి

మణుగూరు టౌన్, ఆగస్టు 30: మండలంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. సిజేరియన్లు తగ్గించాలని సాధారణ ప్రసవాలు చేయాలని సూచించారు. శిశు భ్రూణహత్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా సాయిమమతా, సాయిరాం ఆస్పత్రికి సరైన నాణ్యత పాటించాలని ఆదేశిస్తూ నోటీసులు అందిస్తామని తెలిపారు. మాలకొండయ్య ఆస్పత్రిలో నాణ్యత ప్రమాణాలు పాటించనందున ల్యాబ్, ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేశారు. ల్యాబ్‌లకు అనుమతి లేని వారు త్వరగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. బాలాజీ నాయక్, కల్యాణ్, మణుగూరు పీహెచ్‌సీ వైద్యులు శివకుమార్ ఫయాజుద్దీన్ పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 30: కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. పారిశుధ్య పనులకు రూ.లక్ష, ఇంజినీరింగ్ పనులకు రూ.26 లక్షలు చెల్లించేందుకు సమావేశం ఆమోదించింది. చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, కమిషనర్ శేషాంజన్ స్వామి పాల్గొన్నారు.

మైక్ చాలు.. డీజే వద్దు

ఇల్లెందు రూరల్: మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు రూరల్, ఆగస్టు 30: గణేష్ మండపాల నిర్వాహకులు చిన్న మైక్ మాత్రమే ఉపయోగించవచ్చని, డీజేలకు అనుమతి లేదని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులతో శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. నిర్వాహకులు ఉత్సవ కమిటీ పేర్లను పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించాలని చెప్పారు. సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సైలు నాగుల్ మీరాఖాన్, సూర్యం పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

అశ్వారావుపేట, ఆగస్టు 30: గణేష్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు కచ్చితంగా అనుమతి తీసుకోవాలని సీఐ టి.కరుణాకర్ స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులతో ఆయన శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశమయ్యారు. భక్తులకు, ట్రాఫిక్‌కు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వాడాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలు వాడవద్దని చెప్పారు. వీటిని ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్సై పి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

గొత్తికోయ గ్రామంలో వైద్య శిబిరం

ఆళ్లపల్లి, ఆగస్టు 30: మండలంలోని అడవి రామవరం గొత్తికోయ గ్రామంలో ఆళ్లపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను మాట్లాడుతూ సంఘవ్యతిరేక శక్తులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మీ సమస్యలు మాకు తెలిపితే పరిష్కరిస్తామన్నారు. గ్రామానికి కొత్త వ్యక్తులు వస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు, సోలార్‌లైట్లు అందజేశారు. కార్యక్రమంలో గుండాల సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి, ఆళ్లపల్లి ఎస్సై రతీష్, డాక్టర్ రేవంత్, సంఘమిత్ర, పోలీసు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి మిత్రుల సాయం

పర్ణశాల, ఆగస్టు 30: మండలంలోని మంగవాయిబాడవ గ్రామంలో రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయి పొడియం సురేష్ కుటుంబానికి మిత్రులు ఆర్థిక సాయం చేశారు. కట్టుబట్టలతో బయట పడ్డ విషయం తెలుసుకున్న సురేష్ మిత్రులు కలిసి రూ.13,300ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు పాల్గొన్నారు.

సీతమ్మ బ్యారేజ్ ముంపు భూముల గ్రామసభ

పర్ణశాల, ఆగస్టు 30: మండలంలో గోదావరి నదిపై చేపట్టిన సీతమ్మ బ్యారేజ్ నిర్మాణంలో భాగంగా శుక్రవారం పర్ణశాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, దుమ్ముగూడెం తహసీల్దార్ అశోక్‌కుమార్ గ్రామసభ నిర్వహించారు. రెండో విడత భూ సర్వేలో పర్ణశాల పంచాయతీ పరిధిలో సుమారు 41 ఎకరాలు బ్యారేజ్ నిర్మాణం కోసం ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఎకరా భూమికి ప్రభుత్వం నష్టపరిహారం కింద రూ.8 లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

INDUSIND BANK LTD.
COMMERCIAL VEHICLE FOR SALE
1). TS28TA9312-APE XTRA LD BS6- 2022. 2). TS28TB0385-BAJAJ MAXIMA CNG BS6-2023. 3). TA28TB2620- TATA ACE GOLD DIESEL BS6- 2023
Cell:7337394783
H.No. 6-8-100, 2nd Floor, KNR Mansion, Ganesh Basthi, Kothagudem, Bhadradri Kothagudem Dist.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

'అమ్మ ఆదర్శ కమిటీ' పనులు అభినందనీయం

ఐటీడీఏ పీవో రాహుల్

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్, విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న పీవో, అధికారులు

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 30: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న జీపీఎస్ పాఠశాలలను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పిల్లలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రారంభించిన పనులు సాధ్యమైనంతవరకు బాధ్యతతో పూర్తిచేయడం అభినందనీయమని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో డీఈ, ఏఈ, ఎస్ఆర్‌పీలతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా గిరిజన సంక్షేమశాఖ ప్రైమరీ స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పనులపై మండలాల వారీగా సమీక్షించారు. ప్రైమరీ స్కూళ్లలో సమస్యలు గుర్తించి 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న గిరిజన పిల్లలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి పాఠశాలలో పనులు దాదాపు పూర్తయ్యాయని, దీనికి సంబంధించి ఎంబీఏలు డీఈ, ఏఈ, ఎస్‌సీఆర్‌పీలతో కలిసి సెప్టెంబర్ 10వ తేదీలోగా ఐటీడీఏ కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. అసంపూర్తి పనులు ఆ తేదీనాటికి పూర్తిచేసి 15న ఎంబీఏలు అందజేయాలన్నారు. సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, డీడీ మణెమ్మ, ఖమ్మం డీడీ విజయలక్ష్మి, ఆర్‌సీవో నాగార్జునరావు, ఇన్‌చార్జ్ ఎస్‌వో భాస్కర్, ఏసీఎంవో రమణయ్య, జీసీడీవో అలివేలు, మంగతాయారు, ఏవో నారాయణరెడ్డి, ఎస్‌సీఆర్‌పీలు, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

గిరిజన పిల్లలకు ఐటీసీ ఆర్థిక చేయూత

గిరిజన విద్యార్థినులకు సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ చేయూత అందించడం గొప్ప విషయమని భద్రాచలం ఐటీడీఏ పీవో బీ రాహుల్ అన్నారు. శుక్రవారం భద్రాచలం గిరిజన గురుకులంలో విద్యనభ్యసించి ఐఐటీ, నీట్, ఐజర్ సీట్లు సాధించిన, క్రీడల్లో రాణిస్తున్న పూర్వ, ప్రస్తుత విద్యార్థినులు 10 మందికి ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున రూ.2.50లక్షల చెక్కులను కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పీవో అందజేసి మాట్లాడారు. ఐఐటీ, నీట్, స్పోర్ట్స్‌లో రాణించిన భద్రాచలం గిరిజన గురుకుల బాలికలను ఆయన అభినందించారు. బాలికలు ధైర్యంగా ఉండి లక్ష్యాన్ని ఏర్పరుచుకుని గమ్యస్థానాలకు చేరుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ పీఎస్‌పీడీ అడ్మిన్ మేనేజర్ చెంగల్‌రావు, గిరిజన గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి కే నాగార్జునరావు, గురుకులం ప్రిన్సిపాల్ పద్మావతి, ఎస్ రమాదేవి, భద్రాచలం ఐటీసీ మహిళా సమితి వైస్ ప్రెసిడెంట్ రేష్మ ప్రణవశర్మ, సెక్రటరీ అల్క ప్రఫుల్ల, హిస్టరీ లెక్చరర్ తోటమళ్ల బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

1న 'పెన్షన్ విద్రోహ దినం'

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 30: సెప్టెంబర్ 1ని 'పెన్షన్ విద్రోహ దినం'గా పాటించాలని, ఇందులో భాగంగా ఉద్యోగులంతా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ అమర్నేని రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలన్న డిమాండుతో విద్రోహ దినానికి పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. కొత్తగూడెంలో 1న జరిగే నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభల ప్రచారం

ఇల్లెందు రూరల్, ఆగస్టు 30: పీవోడబ్ల్యూ రాష్ట్ర 7వ మహాసభలు ఈ నెల 31, సెప్టెంబర్ 1,2 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్నాయి. వీటిని జయప్రదం చేయాలని కోరుతూ అరుణోదయ కళాకారులు శుక్రవారం ఇల్లెందులో కళారూపాల ద్వారా ప్రచారం చేశారు. పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్తి సుభద్ర, అరుణోదయ నాయకుడు ఎనగంటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 30: పట్టణంలో చిరువ్యాపారం చేసుకుంటున్న ఇనుముల ప్రవీణ్, షేక్ గౌస్యమణిలకు రోటరీ క్లబ్ ఆఫ్ రివ రైజ్డ్ ఆధ్వర్యంలో సమకూర్చిన తోపుడుబండ్లు, చార్జింగ్ లైట్లను భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ శుక్రవారం అందజేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ రోడ్లపై చిరువ్యాపారం చేసుకునే వ్యాపారులకు రోటరీ క్లబ్ చేయూత అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెండు రాష్ట్రాల తాజా మాజీ గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చెరుకుమిల్లి శ్రీనివాసరావు, ప్రోగ్రాం చైర్మన్ ధనికొండ రాఘవయ్య, కార్యదర్శి గంజి సంపత్, సభ్యులు పాల్గొన్నారు.

బేషరతుగా రుణ మాఫీ చేయాలని ధర్నా

దమ్మపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అశ్వారావుపేట, ఆగస్టు 30: అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణ మాఫీ బేషరతుగా అమలు చేయాలన్న డిమాండుతో సీపీఐ-ఎంఎల్ (మాస్‌లైన్), అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ అనేక వాగ్దాలను గుప్పించి, వాటిని ఇప్పుడు గాలికొదిలేస్తున్నదని ఆరోపించారు. రుణ మాఫీతోపాటు రైతు భరోసా, రైతు బీమా పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన గిరిజనులందరికీ పోడు పట్టాలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ పి.కృష్ణ ప్రసాద్‌కు, ఏవో శివరాం ప్రసాద్‌కు నాయకులు వినతిపత్రాలు ఇచ్చారు. వాసం బుచ్చిరాజు, కంగాల కల్లయ్య, కణితి జోగారావు, కారం రాజులు, సోడెం లక్ష్ముడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేటలో..

దమ్మపేట, ఆగస్టు 30: తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఐ-ఎంఎల్(మాస్‌లైన్) నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. నాయకులు ముత్యాలరావు, గిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ, ఆగస్టు 30: రైతుల రుణ మాఫీని బేషరతుగా అమలు చేయాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు శుక్రవారం పాల్వంచ అగ్రికల్చర్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వేల్పుల రమేష్, వగ్గెల పద్మ, భాస్కర్, రవి, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనపై ముస్లిం మహిళల ర్యాలీ

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మహిళలు

మణుగూరు టౌన్, ఆగస్టు 30: కలకత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని జమాతే ఇస్లామి హింద్, గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముస్లిం మహిళలు, మత పెద్దలు ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ అనంతరం మణుగూరు సురక్షా బస్టాండ్ నుంచి తెలంగాణ చౌరస్తా, సినిమాహాల్ సెంటర్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు ప్లకార్డులతో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని దోషులను కఠినంగా శిక్షించాలని ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అస్మా అలం, ఫర్జానా, యాస్మిన్, షాహిన్, సజరా, సారిక నేహ, జావేరియా, హర్షియా, మారియా ఆఫ్రిన్, ముస్లిం మత పెద్దలు, సిరాజ్, రఫి, అలాఉద్దీఫ్, నిజాముద్దీన్, జలీల్, సర్వర్, అబ్దుల్ రహీం, ఇలియాజ్, బాబా, అబ్దుల్లా, గఫర్, ఇస్మాయిల్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

అశ్వారావుపేట, ఆగస్టు 30: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని సీఐ టి.కరుణాకర్ హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి సీఐ మాట్లాడుతూ.. ర్యాగింగ్ కేసుల్లో చిక్కుకుంటే జీవితం నాశనమైనట్లేనని అన్నారు. క్రమశిక్షణగా మెలగాలని, చక్కగా చదువుకోవాలని, భవితను బంగారుమయంగా తీర్చిదిద్దుకోవాలని ఉద్బోధించారు. సైబర్ క్రైమ్స్, డ్రగ్స్‌పై కూడా అవగాహన కల్పించారు. ఎస్సై శివరామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ ఐవీఎస్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ టి.శ్రావణ్ కుమార్, డాక్టర్ రెడ్డి ప్రియ, డాక్టర్ కె.నాగాంజలి, డాక్టర్ కె.శిరీష, డాక్టర్ రమేష్, డాక్టర్ కృష్ణ తేజ, ఏవో శేషమ్మ పాల్గొన్నారు.

'జీతాలు ఇవ్వట్లే.. మేం బతికేదెట్లా ..'

చండ్రుగొండ, ఆగస్టు 30: తమకు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వట్లేదని, ఎట్లా బతికేదని మండలంలోని 14 పంచాయతీల మల్టీపర్పస్ వర్కర్లు శుక్రవారం ఎంపీడీవో అశోక్‌కు ప్రశ్నించారు. తమకు జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు. లేనట్లయితే, సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి విధులను బహిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, రాము, ఉపేందర్‌రావు, పిచ్చయ్య, దేసు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్కడక్కడ వర్షం

అశ్వారావుపేట రూరల్/అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 30: అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి మండలాల్లోని కొన్ని గ్రామాల్లో శుక్రవారం వర్షం కురిసింది. వరి, పత్తి పంటలకు ఈ వర్షం ప్రాణం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'రుణ మాఫీపై అపోహలొద్దు'

పాల్వంచ రూరల్, ఆగస్టు 30: రుణ మాఫీ విషయంలో రైతులు ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా, వ్యవసాయ శాఖ అధికారులతో సందేహాలను నివృత్తి చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నరసింహరావు కోరారు. మండలంలో నికోడిపుంజుల వాగు గ్రామంలో శుక్రవారం రుణ మాఫీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడున్న రైతులతో మాట్లాడారు. వారి సందేహాలను తీర్చారు. మండలంలో 711 మందిని అర్హులుగా గుర్తించామని, వీరిలో 82మంది వివరాలను అప్‌లోడ్ చేశామన్నారు. పాల్వంచ, కొత్తగూడెం, చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లో 2,500 మంది రైతులకు రుణ మాఫీ లో సాంకేతిక సమస్యలు గుర్తించినట్లు తెలిపారు.

5న కలెక్టరేట్ ముట్టడి

పాల్వంచ, ఆగస్టు 30: వ్యవసాయ కార్మికులకు కూలీ భరోసా పథకం ఏర్పాటు చేయాలని, ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 5న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు వీసం శెట్టి పూర్ణచందర్‌రావు పిలుపునిచ్చారు. స్థానిక చండ్ర రాజేశ్వరరావు భవన్‌లో శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ పేదల సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున ఉద్యమిద్దామని అన్నారు.

బాగా చదవాలి.. ఉన్నతికి ఎదగాలి

పాల్వంచ రూరల్, ఆగస్టు 30: పదోతరగతి విద్యార్థులు బాగా చదవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని పాండురంగాపురం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తమ సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. పాండురంగాపురం, సత్యనారాయణపురం, కోడిపుంజులవాగు పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వంటకాలను పరిశీలించారు. ఇరిగేషన్ ఏఈ ఉర్మిళ, ఏపీవో రంగా, పంచాయతీ కార్యదర్శులు పాషా, బాబా, ప్రభాకర్, కాళి తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులను మెట్ట ప్రాంతాలకు తరలించండి

మణుగూరు టౌన్, ఆగస్టు 30: బూర్గంపాడు మండలంలోని సారపాక గ్రామ పంచాయతీ పరిధి భాస్కర్ నగర్ ఎస్టీ కాలనీ వర్షాకాలంలో ముంపునకు గురి అవుతోందని ఆ ప్రాంతాలను మెట్ట ప్రాంతంలో భూములు కేటాయించాలని సామాజిక కార్యకర్త నల్లమోతు సురేష్, వరద బాధిత పోరాట సంఘం నాయకులు ముత్యాల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే పాయంను కలిసి సమస్య వివరించారు. ముంపు కాలనీలను మెట్ట ప్రాంతంలో భూములు కేటాయించి ఇండ్లు నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తప్పకుండా సమస్య పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

కిన్నెరసాని ఎడమకాలువ గండి పూడ్చివేత

సారపాక, ఆగస్టు 30: మండలంలోని వేపలగడ్డ-నకిరిపేట గ్రామాల మధ్య కిన్నెరసాని ఎడమకాలువ 20.200 వద్ద ఈ నెల 7వ తేదీన గండి పడింది. ఎడమ కాలువకు గండి పడడంతో ఐదెకరాల్లో వరినార్లు పోసుకున్న పొలాలకు నీరు చేరడంతో రైతులు నష్టపోయారు. కిన్నెరసాని ఎడమకాలువకు వేపలగడ్డ-నకిరిపేట వద్ద గండి పడిన విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన చొరవతో ఇరిగేషన్ ఏఈ రాజీవ్ గుత్తేదారు ద్వారా మరమ్మతులు చేపట్టి గండిని పూడ్చించినట్లు తెలిపారు.

రాములోరికి మాస కల్యాణం

ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

పర్ణశాల, ఆగస్టు 30: శ్రావణ శుక్రవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా పర్ణశాల దేవాలయంలో అర్చకులు రామయ్యకు మాస కల్యాణం నిర్వహించారు. కల్యాణ క్రతువు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, యూత్‌రధారణ, కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, స్వామికి, అమ్మవారికి సమర్పించారు. అనంతరం స్వామివారి అమ్మవారి వంశ ప్రవర్లు మహా సంకల్పం, మంగళాష్టకాలు, జీలకర్ర బెల్లం, మాంగళ్య పూజ, మాంగళ్య ధారణ నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకుడు మదన్మోహన్ ఆచార్యులు, శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, ఆలయ ఇన్‌చార్జి అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్

చిన్నారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న వీరయ్య

దుమ్ముగూడెం, ఆగస్టు 30: దుమ్ముగూడెం పీహెచ్‌సీని రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య శుక్రవారం సందర్శించారు. రోగుల వద్దకు వెళ్లి ఆరోగ్య సమస్యలు, వైద్యం అందుతున్న తీరును వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది రోగులకు 24గంటలూ వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ప్రతినిత్యం చేపట్టాలని ఎంపీడీవోకు ఫోన్ ద్వారా సూచించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

ఇల్లెందు రూరల్, ఆగస్టు 30: ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోర్తి జాన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించనున్నట్లు చెప్పారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పాల్వంచ, ఆగస్టు 30: స్థానిక బొగ్గొరుగూడెం ఉన్నత పాఠశాల పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి బదిలీ/ఉద్యోగోన్నతితో బదిలీ అయిన ఉపాధ్యాయులను మిగతా ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించారు. హెచ్ఎం మంగమ్మ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ సభ్యుడిగా శంకర్

రామవరం, ఆగస్టు 30: ఈ నెల 27న భూపాలపల్లిలో జరిగిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) కేంద్ర కార్యవర్గ కమిటీ సమావేశం.. రాసూరి శంకర్‌ను సభ్యుడిగా ఎన్నుకుంది. తన ఎన్నికకు కృషి చేసిన అధ్యక్షుడు రాజిరెడ్డికి, ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణకు శంకర్ ధన్యవాదాలు తెలిపారు.

అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 30: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల తాత్కాలిక నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 6న ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు.

ఇండ్లు కోల్పోకుండా డ్రైనేజీ నిర్మించాలి

చండ్రుగొండ, ఆగస్టు 30: తమ ఇండ్లు పోకుండా డ్రైనేజి నిర్మించాలని కోరుతూ చండ్రుగొండ గ్రామంలోని బెండాలపాడు రోడ్ కాలనీ వాసులు శుక్రవారం ఎంపీడీవో అశోక్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాగులమీరా, రాజేందర్, మౌలాలి, బూరుగు సైదులు, ముత్తారెడ్డి, కల్యాణి, లక్ష్మీనారాయణ, సోందుబీ, నాగమణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ స్థల పరిశీలన

టేకులపల్లి, ఆగస్టు 30: మండలంలోని ముత్యాలంపాడ్ క్రాస్ రోడ్డు పంచాయతీ పరిధిలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు రైతు వేదిక పక్కనున్న స్థలాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం పరిశీలించారు. విద్యుత్ ఏఈ బుజ్జి కన్నయ్య, మండల సర్వేయర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయిలో నవోదయ మోడల్ పరీక్ష

బీఎన్ఆర్

సారపాక, ఆగస్టు 30: ఈ ఏడాది 2024-25లో నవోదయ మెయిన్ పరీక్ష రాయనున్న విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 1న (ఆదివారం) బ్రిలియంట్ పాఠశాలలో జిల్లా స్థాయిలో నవోదయ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఈ పరీక్ష జరుగుతుందని, మెంటల్ ఎబిలిటీ, మ్యాథ్స్ లాంగ్వేజ్‌పై మోడల్ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్ష రాయాలనుకునే విద్యార్థులు ఒకరోజు ముందు తమ పేర్లను బ్రిలియంట్ పాఠశాలలో నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9866283566, 7675040619 లను సంప్రదించాలని బీఎన్ఆర్ కోరారు.

నిత్యాన్నదానానికి బియ్యం వితరణ

దుమ్ముగూడెం, ఆగస్టు 30: మండలంలోని నర్సాపురంలో గల ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం (చిన్న అరుణాచలం) నిత్యాన్నదాన సత్రానికి లక్ష్మీనగరం గ్రామానికి చెందిన కోట్ల రమేశ్ అనే భక్తుడు శుక్రవారం నాలుగ క్వింటాళ్ల బియ్యం క్షేత్ర వ్యవస్థాపకులు శివనాగస్వామికి వితరణగా అందజేశారు. అనంతరం రమేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తండ్రిని చంపిన కొడుకు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

పాల్వంచ, ఆగస్టు 30: కన్న కొడుకే తన తండ్రిని గొంతు నులిమి చంపాడు. పాల్వంచ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరులకు సీఐ తెలిపిన వివరాలు.. పాల్వంచ టౌన్ శేఖరం బంజరకు చెందిన బోడా రాందాస్(47) మృతిపై ఆయన కుమార్తె వాంకుడోత్ ఉమ ఫిర్యాదుతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్ట్‌మార్టం అనంతరం దర్యాప్తు చేపట్టారు. మృతుడి కొడుకు చంటిపై అనుమానంతో అతడిని విచారించారు. తన తండ్రిని తానే చంపినట్లు ఒప్పుకున్నాడు. అతడిని పోలీసులు కోర్టు ఆదేశంతో రిమాండుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సాయి(ఫైల్)

పినపాక, ఆగస్టు 30: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని జానంపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కట్టం సాయి (22) గ్రామంలో తన మిత్రుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా అదుపుతప్పి కిందపడింది. ఈ ఘటనలో సాయి తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో మణుగూరు ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై బయ్యారం పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు ఇసుక లారీల పట్టివేత

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 30: భద్రాచలం బ్రిడ్జి సమీపంలో ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద చర్ల మండలం పెద్దిపల్లి ఇసుక ర్యాంపు నుంచి నిబంధనలను అతిక్రమించి ఓవరులోడ్‌తో వస్తున్న ఆరు ఇసుక లారీలను మైనింగ్ అధికారులు శుక్రవారం పట్టుకుని సీజ్ చేశారు. అదేవిధంగా భద్రాచలం కొల్లుగూడెం ఇసుక ర్యాంప్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచే ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకున్నారు.

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

దుమ్ముగూడెం, ఆగస్టు 30: ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న గుట్కా ప్యాకెట్లను దుమ్ముగూడెం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ములకపాడు సెంటర్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా ట్రాలీ ఆటో అనుమానాస్పదంగా కనిపించడంతో ట్రాలీని ఆపి తనిఖీ చేయగా అంబర్ ప్యాకెట్లు 560, వీ-1 టుబాకో ప్యాకెట్లు 1560, జేకే నెంబర్ 3320 టుబాకో ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామని, వీటి విలువ రూ.22,200 ఉంటుందని ఎస్సై తెలిపారు. వీటిని అక్రమంగా తరలిస్తున్న పాల్వంచకు చెందిన వాహన యజమాని ముక్కా శశాంక్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూట్ మ్యాప్ ఉంది .. రూట్ లేదు

ఆళ్లపల్లి, ఆగస్టు 30: రూట్ మ్యాప్ ఉంది కానీ రూట్ లేకపోవడంతో రేగళ్ల అడవి ప్రాంతానికి వెళ్లి వాహనదారులు ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఒక ఎరువుల లారీ విశాఖపట్నం నుంచి మణుగూరు వెళ్లాల్సి ఉండగా మొబైల్ నెట్ నుంచి రూట్ మ్యాప్ చూపించడంతో డ్రైవర్ అనిశెట్టిపల్లి నుంచి లారీని తీసుకొచ్చాడు. కానీ మర్కోడు నుంచి రేగళ్లకు 9 కిలోమీటర్ల వరకు మట్టి రోడ్డు, గుట్టలు ఉండడంతో వెళ్లేందుకు వీలు ఉంది. దీంతో లారీ మట్టి రోడ్డులో ఇరుక్కుంది. లారీని జేసీబీ సహాయంతో తీశారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాల్వంచ, ఆగస్టు 30: ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్స్ ప్రచార పోస్టర్‌ను డీసీఎంఎస్ చైర్మన్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక మార్కెట్ ఏరియాలోని స్టార్ చిల్డ్రన్ హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ కో-ఆర్డినేటర్ భాస్కర్‌రావు, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ గంగుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.